'చిల్లు'గడ


సొవ్వ ప్రాంతంలో చిలగడ దుంప సాగు

గిరిజన రైతుల కష్టం దళారుల పాలవుతోంది. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పంట పండించి సంతలో విక్రయానికి తీసుకెళ్తే కనీస మద్దతు ధర లేకుండా పోతోందని వాపోతున్నారు. గతేడాది చిలగడ దంప బస్తా రూ.1200 నుంచి రూ.1500 వరకు ధర పలకగా, ప్రస్తుతం రూ.600 నుంచి రూ.800 వరకు కొనుగోలు చేయడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదే రీతిన క్యారెట్, బంగాళ దుంపలు విక్రయిస్తే కనీస ఆటో చార్జీలు రావడం లేదని లబోదిబోమంటున్నారు.

- సంతల్లో దళారుల దోపిడీ
- చిలగడ దుంపకు, క్యారెట్‌కు ధర తగ్గించి కొనుగోలు
- నష్టపోతున్న గిరిజన రైతులు
- ఆదుకోని జీసీసీ, ఐటీడీఏ


సంతకు తరలించడానికి గోనె సంచిలో నింపుతున్న చిలగడ దుంపలు

డుంబ్రిగుడ: చిలగడ దుంపలు పండించే గిరిజన రైతులకు గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నామని లబోదిబోమంటున్నారు. కనీసం ఆటో చార్జీలు కూడా రావడం లేదని, దానికి తోడు వర్షాలకు సగం కుళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన్యంలో పండే చిలగడ, బంగాళదుంప, క్యారెట్‌కు మైదాన ప్రాంతంలో మంచి గిరాకీ ఉంది. దాంతో అధిక సంఖ్యలో గిరిజనులు వీటి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. డుంబ్రిగుడ మండలంలోని సొవ్వ, సాగర, కొల్లాపుట్టు, కురిడి, గుంటసీమ, లైగండ, అరమ, పోతంగి, కొర్రాయి ప్రాంతాల గిరిజన రైతులు వేలాది రూపాయలు వెచ్చించి పొరుగు రాష్ట్రం ఒడిశాలోని కోరాపుట్టు, సిమిలిగుడ, పొట్టాంగి సంతల్లో నారాపల్లా, విత్తనాలు కొనుగోలు చేసుకుని, వారి గరువులలో రెండడుగుల దిబ్బలు ఏర్పాటు చేసి సాగుకు నారపల్లా వేసి, విత్తనాలు వేశారు. మూడు మాసాల్లోనే చిలగడ దుంప కాపు దశకు వచ్చింది.

నష్టపోతున్న గిరిజనులు....

మండలంలోని చిలగడ దుంపలు 40 ఎకరాలలో, క్యారెట్ 322 ఎకరాలలో, బంగాళదుంప 15 ఎకరాల్లో పండిస్తున్నారు. వాటిని సేకరించి గిరిజనులు సమీప వారపు సంతలలో విక్రయానికి తీసుకెళ్తారు. సొవ్వ నుంచి చిలగడ దుంప బస్తాకి రూ.30 ఆటో చార్జీ వసూలు చేస్తారు. అయితే రైతుకు మాత్రం బస్తా రూ.600 నుంచి రూ.800 వరకు వస్తుంది. గతంలో ఇదే చిలగడ దుంప బస్తా


సేకరించిన దుంపల గుట్టలు

రూ.1200 నుంచి రూ.1500 వరకు ధర పలికేదని గిరిజనులు చెబుతున్నారు. ప్రస్తుతం చిలగడ దుంపకు గడ్డు కాలం ఉండటంతో నష్టపోతున్నారు.

క్యారెట్‌ది అదే దారి....

క్యారెట్ ధర పూర్తిగా తగ్గిపోవడంతో వారపు సంతలలో విక్రయించే గిరిజన రైతులకు బస్తా క్యారెట్‌కు రూ.300 నుంచి రూ.500 మాత్రమే వస్తుంది. కావిడి రూ.800 అడుగుతున్నారని వాపోతున్నారు. కనీస మద్దతు ధర లేకపోవడంతో అష్టకష్టాలు పడుతూ వారపు సంతలో విక్రయాలు సాగిస్తూ వచ్చిన డబ్బులతో జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పంటలపై వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు పలు సూచనలు చేస్తున్నారని, కాపు వచ్చి తర్వాత సేకరించి మార్కెట్లో విక్రయాలకు తీసుకెళ్తే గిట్టుబాటు కావడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర లేక నష్టపోతున్నాం



చిలగడ దుంపలు సేకరించేందుకు కుటుంబాలతో ఎంతో కష్టపడుతున్నాం. వాటికి తగిన ధరలు లేకపోవడంతో ఈఏడాది నష్టపోతున్నాం. అధికారులు స్పందించి గిరిజన రైతులకు ప్రోత్సాహంతోపాటు మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

– జన్ని సొమ్‌ర్ర, రైతు, కాగువలస, సొవ్వ పంచాయతీ, డుంబ్రిగుడ మండలం

మద్దతు ధర కల్పించాలి



చిలగడ దుంపలను సేకరించి వాటిని కడిగి వారపు సంతలో విక్రయించాలంటే మాకు రెండు రోజులు పడుతుంది. ఎంతో కష్టపడితే తప్ప మాకు కనీస మద్దతు ధర రావడం లేదు. వ్యవసాయ అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు సంతలో వ్యాపారులతో మాట్లాడి మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

– కొర్ర లైకొన్, రైతు, కాగువలస, సొవ్వ పంచాయతీ, డుంబ్రిగుడ మండలం

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం బుధవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు పార్టీ మండలాధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు విచ్చేస్తున్నారన్నారు. మండలంలో జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, రాష్ట్ర, జిల్లా విభాగ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు హాజరు కావాలని కోరారు.

2న ప్రజావేదిక

కొయ్యూరు: వచ్చే నెల 2న ఉపాధి హామీ తనిఖీలపై సామాజిక ప్రజా వేదికను నిర్వహిస్తున్నారు. రూ.40 కోట్ల ఉపాధి పనులపై పది రోజుల నుంచి ఎస్‌ఆర్పీ, తొమ్మిది మంది డీఆర్పీలు, సోషల్ ఆడిటర్లతో కలిసి తనిఖీలు చేస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించనున్నారు. వచ్చే నెల ప్రజా వేదిక నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఏపీవో శ్రీనివాస్ తెలిపారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ప్రిన్సిపాల్ వసుధ, అధ్యాపకులు

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కాకినాడ పీఆర్ కళాశాలలో జరిగిన నోబెల్ అవార్డ్స్ –2024లో ప్రతిభ చాటారు. విద్యార్థులు నందకేశ్వరరావు (బి.కాం), నాగేంద్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. మరో ఇద్దరు విద్యార్థులు ఏడుకొండలు, శ్రీనాగవల్లి అప్రిసియేషన్ సర్టిఫికెట్స్ పొందారు. వీరిని ప్రిన్సిపాల్ డా. కె వసుధ అభినందించారు.

గ్రామసభలో వీఆర్పీపై ఫిర్యాదు


ఎం. మాకవరంలో నిర్వహిస్తున్న గ్రామసభ

కొయ్యూరు: ఉపాధి హామీలో పనులకు వెళ్లని వారికి సైతం డబ్బులు వేస్తున్నారని వేతనదారులు సోషల్ ఆడిట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎం. మాకవరంలో మంగళవారం ఉపాధి పనులపై నిర్వహించిన గ్రామసభలో అక్కడ వీఆర్పీపై ఫిర్యాదులు చేశారు. పనులకు వెళ్లకుండానే మస్టర్లు వేస్తున్నారని, తర్వాత వచ్చిన డబ్బులను పంచుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు వివరాలను ఎస్‌ఆర్పీ రాజు సహా డీఆర్పీ నమోదు చేశారు. ప్రజా వేదికలో పూర్తి వివరాలను వెల్లడించనున్నారు.

బాలల హక్కులపై అవగాహన తప్పనిసరి

- అడ్డతీగల సీఐ నరసింహమూర్తి


బాలలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ నరసింహమూర్తి

అడ్డతీగల: బాలలు తమకు ఉన్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సీఐ బి.నరసింహమూర్తి తెలిపారు. ఎలిమినేషన్ ఆఫ్ కార్పరల్ పనిష్మెంట్‌లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థికి విద్యా హక్కు చట్టం ప్రకారం చదువుకునే హక్కు ఉందన్నారు. ఈ హక్కు వినియోగించుకుని బాల్య దశ నుంచే ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బాలల న్యాయ చట్టం ప్రకారం తమ హక్కులు, బాధ్యతలు, చట్టం గురించి అవగాహన పెంచుకుని సత్ప్రవర్తతో సమాజానికి ఆదర్శంగా తయారవ్వాలన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసబాబు

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని ఏవో శ్రీనివాస బాబు తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయతీల పరిధి జబడ, బొర్రమామిడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులు, జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో శ్రీనివాసబాబు మాట్లాడుతూ అధిక దిగుబడినిచ్చే పంటలపై దృష్టి పెట్టాలని, ముఖ్యంగా ఎరువుల వాడకం తగ్గించి, ఘన, ద్రవ జీవామృతం వాడటం అలవర్చుకోవాలని, వ్యవసాయ అధికారులు సూచనలు తప్పకుండా పాటించాలని సూచించారు. గ్రామ ఉద్యాన సహాయకురాలు మాధవి, ఏహెచ్‌ఏ బుద్దు, వైఎస్సార్‌సీపీ నేత సాధురాం, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి అండగా ఉంటాం

కుటుంబ సభ్యులను పరామర్శించిన పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


కాంతమ్మ(ఫైల్)

చింతపల్లి: మండలంలో కుడుముసారి సర్పంచ్ బోండా కాంతమ్మ కుటుంబానికి అండగా ఉంటామని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఇటీవల సర్పంచ్ కాంతమ్మ విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గుండె సంబంధిత శస్త్రచికిత్స చేయించుకున్నారు. అనంతరం ఆమె అస్వస్థతకు గురై సోమవారం రాత్రి ఆకస్మికంగా మరణించారు. ఆమె అంత్యక్రియలు భీమనాపల్లిలో మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, తమ్మంగుల, అన్నవరం సర్పంచ్‌లు లక్ష్మయ్య, సన్యాసిరావు, ఎంపీటీసీలు, పలు పంచాయతీల సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.


నివాళి అర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

వలంటీర్లకు రూ.10 వేల వేతనం హామీ నెరవేర్చాలి

సీఐటీయూ మండల కార్యదర్శి శంకర్‌రావు డిమాండ్

ముంచంగిపుట్టు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో వలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ముంచంగిపుట్టులో మండల వలంటీర్లతో సదస్సు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వలంటీర్లకు చేసిన అన్యాయంపై చర్చించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఐదు నెలలకు వేతనాలు చెల్లించాలని, జాబ్ చార్ట్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేశారు. మండల కార్యదర్శి శంకర్‌రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు వలంటీర్లను కొనసాగిస్తామని హామీ ఇచ్చి, నేడు వారిని విధులలోకి తీసుకోకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ఐదు సంవత్సరాలుగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించి, ఎంతో సేవ చేసిన వీరికి అన్యాయం చేయడం దారుణమన్నారు. హామీ నెరవేర్చని పక్షాన ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వలంటీర్ల యూనియన్ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షునిగా గొల్లోరి దేవను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు భీమారాజు, వలంటీర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న వలంటీర్లు, సీఐటీయూ నాయకులు

కుంటుపడుతున్న విద్యాభివృద్ధి

గూడెంకొత్తవీధి మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు

గూడెంకొత్తవీధి: మండలంలో విద్యాభివృద్ధి కుంటుపడుతుందని, చాలా గ్రామాల్లో పాఠశాలలు మూతపడటంతో గిరిజన విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు వాపోయారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ అసలే మారుమూల ఉన్న గూడెంకొత్తవీధి మండలంలో విద్యాభివృద్ధికి పెద్దపీట వేయాల్సిన అధికారులు పాఠశాలలు మూతపడినా స్పందించడం లేదన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాల కల్పనపై ఏటీడబ్ల్యూఓ జయనాగలక్ష్మి సభ్యులకు వివరించారు. మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు కృషి చేయాలని సభ్యులు కోరారు. మండలంలో చేపడుతున్న కార్యక్రమాలు, పథకాల గురించి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు వివరించారు. ఈవోపీఆర్డీ పాపారావు, వైస్ ఎంపీపీ దేముడు తదితరులు పాల్గొన్నారు.


ఆశ్రమాల్లో వసతుల కల్పనపై వివరిస్తున్న ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి

తెగుళ్ల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

జి.మాడుగుల: లువ్వాసింగి, కోరాపల్లి పంచాయతీల్లో సంగులోయ, అరగడపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది వరి పంటలో అగ్గి తెగులు, ఆకుముడత తెగులు గుర్తించి తీసుకోవల్సిన నివారణ చర్యలు గురించి వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించటం గురించి వివరించారు. సర్పంచ్, వార్డు నంబర్లు, మండల వ్యవసాయ అధికారి పాత్రుడు, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది, పశు సంవర్ధక సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి


రక్తదానం చేస్తున్న ఎస్సై నరసింహమూర్తి

రాజవొమ్మంగి: ఆపద సమయంలో ప్రాణాలను కాపాడేందుకు యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఎస్సై నరసింహమూర్తి కోరారు. ఆయన రంపచోడవరంలో మంగళవారం జరిగిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. మండలానికి చెందిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఏక్త దివాస్ పురస్కరించుకుని జాతీయ సమైక్యత అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా మన దేశ గొప్పతనం గురించి తెలుసుకోవచ్చన్నారు. విజేతలకు బుధవారం ఏక్త దివాస్ కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ పోటీల్లో 52 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు ఎన్ఎస్ఎస్ పీవోలు వై. విజయలక్ష్మి, పసుపులేటి నాగబాబు, మొష్యా అనిత కుమారి తెలిపారు.

'రిజర్వేషన్ ప్రకటించిన తర్వాత జనరల్ డీఎస్సీ ఇవ్వాలి'

పెదబయలు: ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో నూరుశాతం రిజర్వేషన్ ప్రకటించిన తర్వాత జనరల్ డీఎస్సీ నిర్వహించాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి పి. అప్పలనర్స, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర తెలిపారు. మంగళవారం మండల 7వ మహాసభలో ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే నూరుశాతం రిజర్వేషన్ కల్పనకు చర్యలు చేపడతామని అరకు ఎన్నికల సభలో హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. జీవో నంబర్–3 రిజర్వేషన్ సాధనకు ఆదివాసీలు పోరాటం చేస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికే కేజీబీవీల్లో ఇతరులతో టీచర్ పోస్టుల భర్తీతో గిరిజన నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గిరిజన హక్కులు, రిజర్వేషన్ల సాధనకు పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. పార్టీ మండల కార్యదర్శి సన్నిబాబు, గంగాధరం, కిల్లో శరభన్న, బుజ్జిబాబు, నరసయ్య, అనీల్‌కుమార్, చెండా రామారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి


అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీపీ కృష్ణారెడ్డి

గంగవరం: మండలంలోని ఆయా శాఖలకు కలెక్టర్ నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది తగిన కృషి చేయాలని ఎంపీడీవో పి.జి.రామకృష్ణ సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఉపాధి హామీ, వెలుగు, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి ఏపీవో ప్రకాశ్, ఏపీఎం షణ్ముఖరావు, ఈవోపీఆర్డీ నరసింగరావు, ఏవో విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఎత్తు, బరువులను నమోదు చేయాలి

- సీడీపీవో విజయకుమారి


చిన్నారి బరువును పరిశీలిస్తున్న సీడీపీవో

కొయ్యూరు: అంగన్‌వాడీ వర్కర్లు పిల్లల ఎత్తు, బరువులను రికార్డుల్లో సరైన విధంగా నమోదు చేయాలని సీడీపీవో విజయకుమారి సూచించారు. కొందరు తప్పుగా రికార్డుల్లో నమోదు చేస్తున్నట్టుగా తెలుస్తుందన్నారు. రాజేంద్రపాలెంలో ఆమె మంగళవారం సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. మారుమూల ప్రాంతాలకు చెందిన వారికి ఆధార్ కార్డులు అప్‌డేట్ చేయని మూలంగా లబ్ధి పొందలేకపోతున్నారని చెప్పారు. అలాంటి వారు విధిగా ఆధార్ కార్డులు అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. లేకుంటే పథకాలకు అనర్హులుగా ఉంటారన్నారు.

చింతపల్లిలో భారీ వర్షం

చింతపల్లి: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండ కాసింది. సాయంత్రం నుంచి వాతావరణం మారింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రహదారులపై నీరు ప్రవహించింది. వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

నిర్వాసితులందరికీ నష్టపరిహారం అందిస్తాం

రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయ డీటీ శ్రీధర్

రాజవొమ్మంగి: ఎన్‌హెచ్ –516 ఈ రహదారి నిర్మాణ పనుల్లో స్థలాలు, ఇళ్లు కోల్పోయిన వారందరికీ నష్టపరిహారం అందుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయ డీటీ శ్రీధర్ తెలిపారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఆదేశాల మేరకు ఆయన మంగళవారం రాజవొమ్మంగి తహసీల్దార్ కార్యాలయంలో హైవే కాంట్రాక్టర్ భరత్, స్థానిక వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్షించారు. రంపచోడవరం మండలం ఐ.పోలవరం నుంచి రాజవొమ్మంగి మండలంలోని బోయపాడు జంక్షన్ వరకు 72 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తున్న జాతీయ రహదారికి సంబంధించి ఇప్పటి వరకు 311 మందిని గుర్తించగా, ఇప్పటి వరకు 267 మందికి నష్టపరిహారం అందజేశామన్నారు. మండలంలో ఇంకా పరిహారం అందాల్సిన వారి పూర్తి వివరాలు సేకరిస్తున్నామన్నారు. రహదారి నిర్మాణం కారణంగా నిర్వాసితులు వాస్తవంగా కోల్పోతున్న ఆస్తుల వివరాలను ఆర్‌అండ్‌బీ ఏఈలు, వీఆర్వోలు, సర్వేయర్ల బృందం మరోసారి ర్యాండమ్‌గా తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. ఈ ప్రక్రియ త్వరలో పూర్తి చేసి డిసెంబర్ 31లోగా పరిహారం అందిస్తామని డీటీ శ్రీధర్ అన్నారు. రహదారి పనుల్లో దేవాలయాలు, వాటికి చెందిన చెట్లు కోల్పోతే గ్రామ పంచాయతీ తీర్మానంతో వాటిని గుర్తించి నష్టపరిహారం అందజేయడం జరుగుతుందన్నారు. రంపచోడవరం తహసీల్దార్ అల్లు సత్యనారాయణ, రాజవొమ్మంగి తహసీల్దార్ సూర్యారావు, డీటీ ఎస్‌కే కరీముల్లా, వీఆర్వోలు సూర్యాకాతం, భూలక్ష్మి, భారతి, రామదాసు, ద్రాక్షాయని, నానాజి, నాగేశ్వరరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.


జాతీయ రహదారి నిర్వాసితులను గుర్తించేందుకు వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్షిస్తున్న డీటీ శ్రీధర్

స్వామి వివేకానంద జీవితం ఆదర్శం

రంపచోడవరం: స్వామి వివేకానంద జీవితం నుంచి యువత ఎంతో నేర్చుకోవచ్చని రామకృష్ణ మిషన్ వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ స్వామి సేవ్యనంద తెలిపారు. స్థానిక మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం, జీవితంపై సానుకూల దృక్పథం పెంపొందించుటకు స్వామి వివేకానంద జీవితం గురించి గిరిజన విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టరు కె. వసుధ, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు చక్రవర్తి, వెంకటేష్, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.


స్వామీజీకి జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఉత్సాహంగా 10కే క్రాస్ కంట్రీ ఈవెంట్


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అరకులోయ టౌన్: ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 10 కే క్రాస్ కంట్రీ ఈవెంట్ ఉత్సాహంగా నిర్వహించారు. ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవెంట్‌ను ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె. భరత్‌కుమార్ నాయక్, పట్టాసి చలపతిరావు ప్రారంభించారు. ఏయూ పరిధిలోని డిగ్రీ కళాశాలలకు చెందిన 87 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బాలుర ఆరుగురు, బాలికలు నలుగురు ఎంపికయ్యారు. పురుషుల విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్ అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దక్కింది. ద్వితీయ స్థానంలో ప్రగతి ఫిజికల్ కళాశాల నిలిచింది. మహిళల విభాగంలో ప్రగతి ఫిజికల్ కళాశాల ప్రథమం, ద్వితీయ స్థానంలో అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు నిలిచారు. వీరు కర్ణాటక రాష్ట్రం మంగుళూరు యూనివర్సిటీలో జరిగే ఆలిండియా క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాళ్లు తెలిపారు. ఏయూ సెలక్షన్ కమిటీ నరేష్, నాగరాజు, డాక్టర్ పి. గౌరీశంకర్, డాక్టర్ ఎల్. ప్రవీణ్ కుమార్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి పసుపులేటి నాగబాబు, పీడీ అప్పారావు, ఎన్ఎస్ఎస్ పీవోలు వై. విజయలక్ష్మి, మొస్యా అనిత కుమారి, కళాశాలల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు వైకుంఠరావు, విజయ, తదితరులు పాల్గొన్నారు.